'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఈ అడుగులు.. చెప్పకనే చెప్తున్నాయి!

**ప్రభుత్వాల మార్పునకు, జనాభిప్రాయం కాసింత అటూ ఇటూ ఒరిగేందుకు దోహదపడే అంశాలెన్నో ఉంటాయనేది బుద్ధి జీవులందరికీ తెలిసిన వాస్తవమే. పొరపాట్లు, ఏమరుపాట్లే కాదు, క్షేత్రస్థాయిలో ప్రజా నాడిని ప్రభావితం చేసే కారకాలు కూడా అనేకం.**



డాక్టర్ ఆంజనేయ గౌడ్



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో 2 శాతం ఓట్ల తేడా, రాజకీయ చైతన్యశీలురందరిలో భిన్న భావాలను కలిగించింది. ఆలోచనపరుల పొలిటికల్ పోస్ట్‌మార్టంలు కొనసాగుతుండగానే, 'కొత్త సర్కార్ కొలువుదీరింది. అది కుదురుకోవడానికి ఆరు నెలల సమయం ఇవ్వాలి కదా?, అప్పుడే విమర్శలు విడ్డూరం' అని కొందరు, 'నడక మొదలు పెట్టగానే తప్పటడుగులు వేస్తుంటే ప్రశ్నించకుండా ఆరు నెలలు అభ్యుదయవాదులు మౌనవ్రతం పాటిస్తే అర్థం ఉంటుందా?' అని మరికొందరు అంటున్నారు. ఎవరి నాయకత్వంలోని ప్రభుత్వమైనా ఏం వాగ్దానం చేసి పగ్గాలను చేతుల్లోకి తీసుకుంది, ఎటువైపు నడిపేందుకు సమాయత్తమై కదులుతున్నదనేదే మనందరం జాగ్రత్తగా గమనించాల్సింది. నిలదీయడానికి అమృత గడియల కోసం ప్రగతి కాముకులు ఎదురుచూస్తే ఎలా? లేచిందే లేడికి పరుగు అన్నట్టుగా రేవంత్ రెడ్డి సర్కార్ పరుగులు పెడుతున్నా, దాని ప్రతి చర్యా మనకొక సందేశాన్ని, కోడికూతలా మేలుకొలుపు శబ్దాన్ని అందిస్తున్నది. నిజానికి ఆరున్నర దశాబ్దాల తండ్లాట నుంచి బయటపడి, తెలంగాణ ఎంతోదూరం అడుగులు వేసింది. రిజర్వ్ బ్యాంక్ హ్యాండ్‌బుక్‌తో పాటు నీతి ఆయోగ్, నేషనల్ క్రైం బ్యూరో రికార్డ్స్ ఇలా ఏ జాతీయ ప్రామాణిక గణాంకాలు గమనించినా దశాబ్దంలోనే రాష్ట్రం సాధించిన వాస్తవాలు మనకందరికీ అర్థమవుతాయి. తలసరి ఆదాయమైనా, జీఎస్‌డీపీ అయినా, జీవన ప్రమాణాలు, మౌలిక వసతులతో పాటు తాగు, సాగునీటి రంగాల్లో, సాగు, పారిశ్రామిక వ్యవస్థల్లో ఎంత పురోగతిని తెలంగాణ రాష్ట్రం సాధించిందనేది కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలే తేటతెల్లం చేశాయి. అది మరిచి ఎన్నికల ప్రచారంలో అనుసరించే మొరటుతనాన్ని పీఠమెక్కిన తర్వాత పాలనలోనూ నాయకులు ప్రదర్శిస్తే ప్రజల మనసు చివుక్కుమనదా? ప్రభుత్వాలు మారినా అవి ప్రజాస్వామ్యానికి కొనసాగింపు మాత్రమే కదా? ప్రజాభిప్రాయానికి తలవంపులు తేని దారిలో కొత్త సర్కార్ అడుగులు పడితేనే మార్పునకు అర్థం ఉంటుంది. అలాంటి దిశలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడక మొదలుపెట్టిందా అంటే ప్రశ్నార్థకమే..?

విపక్షంలో ఉన్నప్పుడు ప్రగతిభవన్ నిర్మాణంపై ఆరోపణలు చేశారని, సీఎం నివాస భవంతిగా ఉపయోగించుకోవడం లేదు సరే మరి నూతన సచివాలయ నిర్మాణాన్నీ తప్పుబట్టారు కదా? తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవ ప్రతీకలుగా నిలిచేందుకు నిర్మించిన ప్రగతిభవన్, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపాలను కూడా, ఎన్నికల ముందటి రాజకీయ ప్రకటనల దృష్టికోణంతోనే చూడటంలో వివేకం కనపడుతుందా అనేది అందరూ ఆలోచించాలి. ప్రమాణ స్వీకారం తర్వాత అమరుల స్థూపాన్ని, అంబేద్కర్ స్మారక స్థూపాన్ని సందర్శించి నివాళులు అర్పించేందుకు మనసు రాకపోవడం ఆవేదన కలిగించేదే కదా! అంతెందుకు ప్రమాణ స్వీకార సభలో 'జై తెలంగాణ' నినాదమే బంగారమైపోయింది. తొలి అడుగుల్లోనే తెలంగాణ ఆశించేది ఉక్రోషాన్ని కాదు, ఉన్నతమైన ధోరణిని అనేది ప్రస్తుత పాలకులు అర్థం చేసుకోవాలి. 'ప్రగతిభవన్' పేరు 'పూలే ప్రజాభవన్'గా మార్చి అందులో ప్రభుత్వాధినేత ఉండటానికి ఇష్టపడకపోతే ఆ చర్య ఇస్తున్న సందేశమేమిటి? అంబేద్కర్ సచివాలయాన్ని కూడా కేసీఆర్ ప్రభుత్వం ఆధునిక దేవాలయంలా నిర్మిస్తుంటే తప్పుపట్టారు, మరి అందులో కొలువుదీరారెందుకు? పూలే ప్రజాభవన్ పేరు మార్పు హడావుడి పక్కనపెడితే నిజానికి ప్రగతి అనే పేరులోనే సామాజిక పురోగతి కోసం అమరులైన పూలే, అంబేద్కర్‌తో సహా అందరి పేర్లు, ఆశయాలు ఇమిడి ఉన్నాయి. ప్రగతి భవన్ గేట్ల తొలగింపు దగ్గరి నుంచి, పాతవి చెరిపెయ్యాలనే తొందరలో అభాసుపాలయ్యే పనులు అవసరమా అనే కోణంలో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి. అధికారంలోకి రావడానికి ఏ మార్గంలోనైనా నడిచి వచ్చి ఉండవచ్చు. కానీ, పాలనా పీఠాన్ని అలంకరించిన తర్వాత నిర్మాణాత్మక దృక్పథం ఉంటే రేపటితరాలు కూడా కీర్తిస్తాయనే సత్యం అవగాహనలో ఉండాలి కదా!

ముందుచూపున్న ఏ సర్కార్ అయినా పది తరాలకు పనికొచ్చేలా నిర్మాణాలు చేస్తుంది. ఆ నిర్మాణాలకు ప్రాంత వైభవం అద్దుతుందే కానీ, దరిద్రాన్ని కాదు. ఆ మాటకొస్తే వందల ఏండ్ల కిందటే అత్యద్భుత నిర్మాణాలు చేసిన నిజాం నవాబులు, నేటికీ మనకు ఉపయోగపడే భవనాలు నిర్మించి తప్పులు చేశారా? పాలకుల దృష్టికోణం రేపటి వైపుంటేనే చరిత్రకు దారి పడుతుంది. ఒకటో, రెండో పొరపాట్లు దొర్లని ప్రభుత్వాలు చరిత్రలో ఉండనే ఉండవు. వాటినే గెలకాలనుకునే నూతన సర్కార్‌ల ఆలోచన తీరే హాస్యాస్పదమవుతుంది. ఏ కొరత లేనివిధంగా కేసీఆర్ ప్రభుత్వమే అన్నీ సమకూర్చిన తర్వాత కొత్త వాహనాల కొనుగోలు, నూతన నిర్మాణాలు చేపట్టి దుబారా చెయ్య మనే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనకు అర్థం ఉంటుందా? వర్తమానం, భవిష్యత్తు అవసరాల మేళవింపుతోనే బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనా విధానాలు అమలు జరిగాయి. ఆ దిశలోనే ప్రగతిభవన్, అంబేద్కర్ సచివాలయం, జిల్లా కలెక్టరేట్‌లు నిర్మించబడ్డాయి. పాలన ప్రజల ముంగిట సాగిలపడటానికే నూతన జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేయబడ్డాయి. విపక్షంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంపై మోపిన నిందలను నిజం చేయడానికి రేవంత్‌రెడ్డి సర్కార్ శ్రమిస్తున్న తీరు బుద్ధిజీవుల్లో ఆవేదన కలిగిస్తున్నది. చివరికి శాసనసభలో గవర్నర్ ప్రసంగాన్ని నిందల చుట్టూ తిప్పడం విడ్డూరమే కదా! ఏం చేయబోతున్నారో చెప్పింది గోరంతైతే, బీఆర్ఎస్ ప్రభుత్వంపై చల్లిన బురద కొండంత. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన రైతు, బడుగువర్గాల అభివృద్ధి పథకాల కొనసాగింపు, కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధతతో పాటు ప్రజల అనుభవంలోకి తెచ్చే నిర్దిష్ట కార్యాచరణను శాసనసభ సాక్షిగా గవర్నర్ ప్రసంగంలో ఆశించినవారికి నిరాశను, నిందలనే వడ్డించారు. నిన్నటి దారిలో నడవడం ఇష్టం లేకపోతే మరో దివ్యమైన దారిని పరుచుకొని నడవాలే కానీ, వేసిన దారిని ఎగతాళి చేయడానికే సర్వశక్తులు వెచ్చిస్తే ఎలా? కాలం ఎంత విలువైనదో కాంగ్రెస్ పాలకులకు తెలియనిదేం కాదు. వారి చేతుల్లో ఉన్న వర్తమానాన్ని వెలుగుల కోసం వాడకపోతే మళ్లీ చీకటి గుహలోకే దుంకుతారు.

ప్రగతిభవన్ అంశం దగ్గరినుంచి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల భద్రత చర్యల ఉపసంహరణ వరకూ చివరికి ఎంతో మంది మహామహులకు ఎదురునిలిచి రాష్ట్రం సాధించడంతో పాటు, పదేండ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌కు అధికారంలోకి వచ్చి 10 రోజులు గడవకముందే భద్రతాచర్యలు నామమాత్రం చేయడం పగతనానికి ప్రతీకగా నిలుస్తుందే కానీ, పేరు తెచ్చిపెడుతుందా?

**పాత ప్రభుత్వంలో సేవలందించిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులనూ తొలగిస్తూ జీవో ఇవ్వడం ఎన్ని కుటుంబాలను ఇబ్బందుల పాలు చేస్తుందో ఆలోచించరా? పగ ధోరణి అనేక మంది ప్రభువులను చరిత్రలో దోషులుగా నిలబెట్టింది. ప్రగతిపథంలో సాగిన పాలకులకు ప్రజల గుండెల్లో కొలువుదీరే ఉన్నతస్థానం కల్పించింది. ఏది ఆశించి అడుగులు వేస్తున్నామనే వివక్ష కరువైతే వ్యవస్థకు ఉరితాడు పేనడమే అవుతుంది.**

గత ప్రభుత్వంపై నెట్టే ఏ నిందకైనా బాధ్యత ఆ పదేండ్ల మంత్రిమండలిది అవుతుందే కానీ, వ్యక్తిగతంగా కేసీఆర్‌ది కాదు కదా? గత సర్కార్‌లో మంత్రులుగా పనిచేసిన తుమ్మల, జూపల్లిలు నేటి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలోనూ కొలువై ఉన్నారు. చేతిలో అధికారాన్ని నిన్నటికి మసిపూయడానికి కాకుండా రేపటికి దారులెయ్యడానికి ఉపయోగిస్తే కాంగ్రెస్ సర్కార్ కూడా మంచి ప్రభుత్వాల సరసన నిలుస్తుంది. ఆ దారి తప్పి భిన్నంగా ప్రవర్తిస్తే పాత పేరునే హస్తం పార్టీ సార్థకం చేసుకుంటుంది. ఏ దిశలో నడవాలనుకుంటున్నారో ఈ పది రోజుల చర్యలు చెప్పకనే చెప్తున్నాయి.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

# ఒకే మతాన్ని ప్రచారం చేయడం అజ్ఞానం

**చరిత్రకు అందని అతి ప్రాచీనకాలం నుంచి దేశ స్వాతంత్ర్యం వచ్చేవరకు కశ్మీర్ చరిత్రను మనం కూలంకషంగా పరిశీలించాం. ఈ పరిశీలనలో మనకు స్పష్టంగా తేలే అంశం ఏమంటే.. ఇస్లాం మతం కశ్మీర్‌లో ప్రవేశించిన క్రీస్తుశకం 14వ శతాబ్దంలో కశ్మీర్ చరిత్ర ప్రారంభం కాలేదు. కశ్మీరియత్ అంటే కేవలం ఇస్లాం మత సంబంధమైనది కాదు. కశ్మీర్‌కు ఐదు వేల సంవత్సరాల సుదీర్ఘ, సుసంపన్నమైన సాంస్కృతిక, సామాజిక చరిత్ర ఉన్నది. నాగా తెగలు, మైదాన వాసుల సహజీవన చరిత్ర దానిది.**

**కశ్యప మహర్షి పేరుతో కశ్మీర్, సంస్కృత వ్యాకరణవేత్త పాణినిని, ఆయుర్వేద పితామహుడు చరకుని, అలంకార శాస్త్రవేత్త మమ్మటుని అందించింది. శారదా విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పిన కశ్మీరాన్ని, శ్రీనగర్ నిర్మించిన అశోకుని వారసత్వాన్ని తెలుసుకోకుండా కశ్మీరియత్‌ను అర్థం చేసుకోలేం. నాగా, హిందూ, బౌద్ధ, సిక్కు, సూఫీ, ఆఫ్ఘన్, డోగ్రాల సంస్కృతీ, సంప్రదాయాల సమ్మేళనమే కశ్మీరియత్. కశ్మీరియత్ అంటే కేవలం ముస్లిం మత ఛాందసవాదానికే పరిమితం చేసే వేర్పాటువాదం కాదు.**



ఆనందేశి నాగరాజు
98488 38323

**దేశ విభజన-కశ్మీర్:** స్వాతంత్ర్యం వచ్చాక దేశం నుంచి మత ప్రాతిపదికన పాకిస్థాన్ విభజించబడటం చారిత్రక విషాదం. ఇస్లాం మతాన్ని జాతీయతగా భ్రమించి ముస్లింలను ముస్లిం లీగ్ తప్పుదోవ పట్టించడం, మతవాదాన్ని జాతీయ విముక్తి ఉద్యమంగా భావించి కమ్యూనిస్టులు వత్తాసు పలకడం, విభజించి పాలించు అనే ద్వంద్వనీతితో భారతీయుల మధ్య బ్రిటిషు వారు మత వైషమ్యాలు రెచ్చగొట్టడం వల్ల దేశ విభజన జరిగి లక్షలాది మంది మత కలహాలలో చనిపోయారు. వేలాదిమంది ఇరు దేశాలలో కట్టుబట్టలతో శరణార్థులుగా వలసపోయారు. ముస్లింల కోసం ప్రత్యేక పాకిస్థాన్ ఏర్పడినప్పటికీ భారతదేశంలో ముస్లింలు అధికంగా ఉన్న కశ్మీర్ లాంటి ప్రాంతాలను, ముస్లిం సంస్థానాధీశులు ఉన్న హైదరాబాద్ లాంటి ప్రాంతాలను పాకిస్థాన్‌లో కలపడానికి పాకిస్థాన్ అధ్యక్షుడు జిన్నా ఇక్కడి తాబేదార్లతో కుట్రలు పన్నాడు. అతని కుతంత్రాలకు కలతచెందిన మహాత్మాగాంధీ ఇరుదేశాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొల్పడానికి హెచ్.ఎస్.సుహ్రావర్దిని 1947 అక్టోబర్‌లో తన దూతగా జిన్నా వద్దకు పంపించాడు. ఇరు దేశాల్లోని అల్పసంఖ్యాక వర్గాల, మతాల వారి రక్షణకు చర్యలు తీసుకోవాలనీ, పొరుగు దేశ ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదని షరతులతో శాంతి, పరస్పర సహకార ఒప్పందంపై సంతకం చేయవలసిందిగా జిన్నాను కోరారు. జిన్నా ఆ ఒప్పందంపై సంతకం చేయడానికి నిరాకరించాడు.

ప్రతిగా ఐదు వేల మంది అఫ్రిదీలు, పఠాన్‌లకు ఆయుధాలు సమకూర్చి 1947, అక్టోబర్ 22 నాడు కశ్మీరుపై దురాక్రమణకు ఉసిగొల్పాడు. కశ్మీర్‌కు చెందిన సైన్యంలోని ముస్లిం సైనికులు పాకిస్థాన్ దురాక్రమణదారులతో చేతులు కలిపి జిహాద్ పేరుతో వేలాది మంది హిందువులను, సిక్కులను ఊచకోత కోశారు. కశ్మీర్ రాజు హరిసింగ్, కశ్మీర్‌లోని ప్రధాన రాజకీయ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్లా లిఖితపూర్వకంగా భారతదేశంలో విలీనం కావడానికి అంగీకారం తెలపడంతో 1947, అక్టోబర్ 26 నాడు భారత సైన్యం కశ్మీర్ రక్షణకు పూనుకున్నది. జిన్నాతో పొసగనందుకే షేక్ అబ్దుల్లా భారత్‌లో విలీనం వైపు మొగ్గు చూపాడు. వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చి కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో కలపడానికి భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన ప్రయత్నాలను జిన్నా తిరస్కరిస్తూ ఏదేమైనా 'కశ్మీర్‌లో పండిన ఆపిల్ లా నా ఒడిలో పడటం ఖాయమని' అన్నాడు. పాకిస్థాన్‌లో విలీనం కాకుండా భారత్ వంటి 'సామ్రాజ్యవాద దేశం'తో చేతులు కలిపినందుకు షేక్ అబ్దుల్లాను భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా విమర్శించింది.

భారత్‌లో విలీనానికి అంగీకరించాక షేక్ అబ్దుల్లా తన వాటాగా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని, ప్రత్యేక జెండా, ప్రత్యేక చట్టాలకు అనుమతించడంతో పాటుగా భారత రాజ్యాంగంలోని అనేక అంశాలనుంచి, సుప్రీంకోర్టు పరిధి నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేసి, రాజ్యాంగంలో 370 అధికరణాన్ని పొందుపరిచేలా చేశాడు. ఈ ప్రతిపాదనకు అప్పటి గృహ మంత్రి సర్దార్ పటేల్ ససేమిరా అన్నప్పటికీ, తర్వాత అందుకు అంగీకరించి ముసాయిదా రాజ్యాంగ ప్రతిపాదన తయారు చేయవలసిందిగా డాక్టర్ అంబేద్కర్‌ను కోరారు. రాజ్యాంగం 370 అధికరణాన్ని రూపొందించడానికి, కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని నిరాకరిస్తూ అంబేద్కర్ ఇలా అన్నాడు.. 'కశ్మీర్ ఎల్లలను భారతదేశం కాపాడాలని, కశ్మీర్‌లో రోడ్లు నిర్మించాలని, వారికి ఆహార ధాన్యాలు సరఫరా చేయాలనీ, భారతదేశంతో పాటు అన్ని విషయాల్లో సమాన వాటా కావాలని కోరతారు. కానీ, భారత పౌరులకు కశ్మీర్‌లో ఎలాంటి హక్కులు ఇవ్వడానికి నిరాకరిస్తారు. భారత ప్రభుత్వానికి కశ్మీర్‌లో పరిమిత హక్కులు మాత్రమే ఇస్తామంటారు. ఇలాంటి ప్రతిపాదనకు అంగీకరించడం అంటే భారతదేశ ప్రయోజనాలకు ద్రోహం చేయడమే. భారత దేశ న్యాయశాఖ మంత్రిగా నేను ఇది ఎప్పటికీ చేయలేను..'

**కశ్మీరియత్.. ఓ మహోజ్వల గాథ-3**



భారత్‌లో కశ్మీర్ విలీనమై ప్రత్యేక ప్రతిపత్తి పొందిన తర్వాత ఏర్పడిన నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం గానీ, మరే ఇతర ప్రభుత్వాలు గానీ కశ్మీర్‌లో శాంతిభద్రతలను కాపాడటంలోనూ, మత సామరస్యాన్ని నెలకొల్పడంలోనూ పూర్తిగా విఫలమయ్యాయి. అంతేకాకుండా వాటి పాలనా కాలంలోనే వేర్పాటువాద ధోరణులు, తీవ్రవాద దాడులు అధికమయ్యాయి. దీని పర్యవసానంగా ముస్లిం లీగ్‌కు చెందిన హిజ్బుల్ ముజాహిదీన్, జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) వంటి తీవ్రవాద సంస్థలు 1989లో పెద్ద ఎత్తున హింసాయుత దాడులకు పాల్పడి వేలాదిమంది హిందువులను, ముఖ్యంగా కశ్మీర్ పండితులను అమానుషంగా చంపారు. ఈ మతోన్మాద దాడులకు భయపడి 4 లక్షలకు పైగా హిందువులు కశ్మీరు నుంచి కట్టుబట్టలతో తమ దేశంలోనే శరణార్థులుగా అనేక ప్రాంతాలకు వలసవెళ్లారు. కశ్మీర్ చరిత్రలో ఇది మూడో హిందూ జన హననం.

కశ్మీర్‌లో వేర్పాటువాద ముఠాలు కోరే ఆజాదీ (స్వాతంత్ర్యం) ఏమిటి? వారి కశ్మీరియత్ ఏమిటి? కశ్మీర్‌లో ఇస్లాం స్థాపించడం, నిర్బంధ షరియా చట్టాన్ని అమలుచేయడం అన్ని వేర్పాటువాద, తీవ్రవాద ముఠాల లక్ష్యం. పాకిస్థాన్‌లో కశ్మీర్‌ను విలీనం చేయడమో లేదా ఇస్లామిక్ కశ్మీరును ఏర్పాటుచేయడమో వీరి సిద్ధాంతం. వీరు కోరే ఆజాదీ కేవలం ముస్లింలకేనా? కశ్మీర్‌లోని హిందువుల, సిక్కుల, బౌద్ధుల, క్రిస్టియన్ల హక్కులు, సంస్కృతీ, సంప్రదాయాల పట్ల సహనం పట్టదా? అరుంధతిరాయ్, కమ్యూనిస్టులు, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీఎఫ్ తదితర వ్యక్తులు, పార్టీలు మానవ హక్కుల గురించి, కశ్మీరియత్ గురించి ఎన్ని కాకమ్మ కబుర్లు చెప్పినా వారు ఒక మతాన్ని, అది కూడా ముస్లిం మతాన్ని మాత్రమే ఒక ప్రాంతం ప్రత్యేకతగా ప్రచారం చేయడం అజ్ఞానం. సెక్యులరిజం గురించి ప్రతిక్షణం జపించే ఈ వ్యక్తులు, పార్టీలు ఒక మతం ప్రాతిపదికన ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలనడం విడ్డూరం. కమ్యూనిస్టులకు ఇలాంటి చారిత్రక తప్పిదాలు చేయడం అలవాటే. ముస్లింలను ఒక జాతిగా గుర్తించి పాకిస్థాన్ ఏర్పాటుకు సైద్ధాంతిక, ప్రత్యక్ష మద్దతు ఇచ్చి దేశ విభజనకు దోహదం చేసిన చరిత్ర వీరిది.

**పాలస్తీనాలో జరుగుతున్న అణచివేతపై ఉద్యమాలు లేవనెత్తుతూ, అమెరికాలో నల్లజాతి ప్రాణాలకు విలువ ఉందని గొంతుచించుకునే వామపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య పార్టీలు కశ్మీర్‌లో హిందువులు, సిక్కులు, బౌద్ధులు, క్రిస్టియన్లపై జరిగే హింసాకాండను గానీ, కశ్మీరీ పండితులపై జరిగే హత్యాకాండలపై గానీ, కశ్మీరీ ముస్లిం మహిళలపై ముల్లాలు, ఇస్లాం మతతత్వవాదులు విధించే నిర్బంధాలపై గానీ నోరు మెదపరు.**

**కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు-రాజ్యాంగ అధికరణం 370 రద్దు:** రాజ్యాంగ అధికరణం 370 తొలగించి తద్వారా కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని భారత పార్లమెంట్ రద్దుచేయడాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్, కమ్యూనిస్టు, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీఎఫ్ తదితర పార్టీలు ఈ పార్లమెంట్ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ అంశంపై వచ్చిన అన్ని కేసులను ఒకే కేసుగా ఏకంచేసి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అధ్యక్షతన ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ధర్మాసనం ద్వారా విచారించింది. 2023, డిసెంబర్ 11న తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, రాజ్యాంగ అధికరణం 370 తొలగించి కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని భారత పార్లమెంట్ రద్దుచేయడం రాజ్యాంగబద్ధమేనని ఏకగ్రీవంగా సమర్థించి దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడి ఒకే దేశం, ఒకే జెండా, ఒకే చట్టం, ఒకే లౌకిక రాజ్యాంగం సూత్రాన్ని చాటిచెప్పింది.


## ఎటమటం

### ఇక పొత్తులు ఎందుకు?




లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తాం... ఎవరితోనూ పొత్తులు ఉండవని రాష్ట్ర బీజేపీ ప్రకటించింది. వచ్చే ఏడాది మే నెలలో జరగాల్సిన ఎన్నికల్లో పొత్తులపై ఇంత త్వరగా ప్రకటన చేయడంలో మతలబు ఏమై ఉంటుంది?. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఎవరితోనూ పొత్తు పెట్టుకోనవసరం లేనన్ని ఓట్లేమీ పడలేదు. అలాంటప్పుడు ఎవరితోనూ పొత్తులుండవని ఎందుకు ప్రకటించినట్టు? అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల కోసం బీజేపీయే ప్రయత్నించింది. తెలంగాణలో ఏ పార్టీ ముందుకు రాకపోవడంతో పక్క రాష్ట్ర పార్టీ జనసేనతోనూ పొత్తుతో సరిపెట్టుకుంది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ఎవరితో పొత్తులుండవని ఎందుకు ప్రకటించినట్టు?. అసలు విషయం ఏమంటే, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే 119 నియోజకవర్గాలకు అభ్యర్థులు అవసరం. అంతమంది అభ్యర్థులు ఆ పార్టీలో లేకపోవడంతో కొన్ని సీట్లు జనసేనకు అంటగట్టక తప్పలేదు. అదే లోక్‌సభ ఎన్నికలకు అయితే 17 మంది అభ్యర్థులు చాలు, అభ్యర్థుల కోసం వెతుక్కోనవసరం లేదు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన ముగ్గురు ఎంపీలతో పాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎలాగూ ఉన్నారు. ఈ నలుగురు ఇన్‌స్టంట్ అభ్యర్థులు పోగా ఇంకా కావాల్సింది 13 మంది అభ్యర్థులే. ఈ ధీమాతోనే ఎవరితోనూ పొత్తులు ఉండవని ప్రకటించి ఉంటారు కాబోలు.

### ఆ గాలే లేకపోతే ఏమయ్యేదో?



ఎన్నికల ముందు పార్టీ మారితే ఎన్ని కష్టాలుంటాయో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసెంబ్లీ లాబీల్లో చెప్పుకొచ్చారు. మునుగోడు ఉప ఎన్నికలప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరితే తనతో రాలేక కాంగ్రెస్ కార్యకర్తలంతా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సారి సరిగ్గా ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరితే బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారేమో తిరిగిరాలేదు. బీజేపీ కార్యకర్తలేమో అక్కడే ఉండిపోయారు. దాదాపు ఒంటరి పోరాటమే చేయాల్సి వచ్చింది. ఏదో కాంగ్రెస్ గాలి ఉండబట్టి దేవుడి దయతో బయటపడ్డా. నేను ఊహించిన దానికంటే ఎక్కువగా 40 వేల మెజారిటీతో గెలవడం చిన్న విషయం కాదు. నా పరిస్థితి తలచుకుంటేనే ఒక దశలో భయమేసిందని వాపోయారు.



### నాకు తెలియాలి!

సినిమాటోగ్రఫీ మంత్రి అయితే సినిమావాళ్లంతా పొలోమంటూ పరిగెత్తుకొస్తారని అనుకున్నారు. కానీ, దిల్ రాజు తప్ప నాకు ఎవరు కూడా ఫోన్ చేయలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వాపోయారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఆయన 'అసలు అక్కడేం జరుగుతుందో నాకు తెలియాలి.. నివేదిక ఇవ్వండి' అని అధికారులను ఆదేశించారు. శుభాకాంక్షలు చెప్పడానికి వాళ్లు రాకపోతే అధికారులు మాత్రం ఏం చేస్తారు పాపం... ఎందుకు రాలేదో వాళ్లు మాత్రం ఏమని నివేదిక ఇస్తారు. సినిమా వాళ్లు ఎలాంటివారో బహుశా తెలిసే, సీఎం రోశయ్య తన హయాంలో వాళ్లకు తన క్యాంప్ ఆఫీస్‌లో నో ఎంట్రీ అని మొహమాటం లేకుండా ప్రకటించిన విషయం చాలామందికి గుర్తుండే ఉంటుంది.



### బర్రెలక్కతో పోలికా?

ఎన్నికలు ముగిశాక కూడా నాయకులు, ప్రజలు బర్రెలక్కను మాత్రం మరిచిపోవడం లేదు. తాజాగా ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జనసేనను ఉద్దేశించి పవన్‌కల్యాణ్ పార్టీకి తెలంగాణలో బర్రెలక్కకు వచ్చినన్ని ఓట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. అలాగే పాలేరులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్వయంగా పోటీ చేసినా ఆయనకు కూడా బర్రెలక్కకు వచ్చినన్ని ఓట్లు రాలేదని సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. ఎన్నికల్లో తక్కువ ఓట్లు పడితే ఇంతవరకు నోటా ఓట్లు ఒక కొలమానంగా ఉంటే ప్రస్తుతం బర్రెలక్క ఓట్లు కొలమానంగా మారాయి.

- వెల్జాల

### దేశం ఎలా సురక్షితంగా ఉంటుంది?

**ప్రతిపక్ష ఎంపీలు ఏమైనా చట్టవిరుద్ధమైనా డిమాండ్ చేస్తున్నారా? ఏదైనా తప్పుగా మాట్లాడుతున్నారా? మన దేశంలోనే అత్యంత భద్రత మధ్య ఉండే భవనంలో జరిగిన భద్రతా వైఫల్యం గురించి చర్చించాలని డిమాండ్ చేయడం తప్పవుతుందా? పార్లమెంట్ భవనానికే భద్రత లేకపోతే, దేశం ఎలా సురక్షితంగా ఉంటుంది?**

-రాఘవ్ చద్దా, రాజ్యసభ సభ్యుడు





### సంజ్ఞలు చేయవద్దు.. నోటితో మాట్లాడండి!

**మిస్టర్ రాఘవ్ చద్దా.. మీరు ఇలా చేతితో సంజ్ఞ చేయనవసరం లేదు. సభలో ఏదైనా చెప్పాలనుకుంటే నోటిని ఉపయోగించండి. చేతులతో సంజ్ఞలు చేయవద్దు. ఇది మీరు నేర్చుకునే సమయం. త్వరలో మీరు కూడా డ్యాన్స్ చేస్తారని అనిపిస్తున్నది. నిశ్శబ్దంగా మీ స్థానంలో కూర్చోండి. గతంలోనే ఈ సభ మీకు శిక్ష వేసింది.**

- జగదీప్ ధన్‌ఖర్, రాజ్యసభ చైర్మన్